## రాష్ట్ర మాల సంఘాల జేఏసీ మద్దతు బీఆర్ఎస్‌కే

• తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ చైర్మన్ చెరుకు రామచందర్



సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ చైర్మన్ రామచందర్

బొడ్రాయిబజార్, నవంబర్ 19 : రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్న ఏకైక ప్రభుత్వం సీఎం కేసీఆర్ ప్రభుత్వమని తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ అధ్యక్షుడు చెరుకు రామచందర్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ అభ్యర్థులకు, సూర్యాపేటలో మంత్రి జగదీశ్‌రెడ్డికి తమ మద్దతును ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో రాంజ్యాగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేద్కర్ 125 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేయడంతో పాటు నూతన సచివాలయానికి అంబేద్కర్ పేరు పెట్టడం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, సీఎం కేసీఆర్‌కే సాధ్యమైనట్లు చెప్పారు. దళితులను ఆర్థికంగా, సామాజికంగా ఆదుకునేందుకు దళిత బంధు ప్రవేశపెట్టి వారి జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. మాలల సమస్యలను పరిష్కరించడంలో కూడా సీఎం కేసీఆర్ విశేష కృషి చేస్తున్నట్లు తెలిపారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో రెండు ఎకరాల స్థలంలో, హైదరాబాద్‌లో ఐదు ఎకరాల స్థలంలో మాల భవనాల నిర్మాణంతో పాటు మాలలకు రాజకీయంగా పదవులు కల్పిస్తున్నట్లు వెల్లడించారు. వాటన్నింటిని దృష్టిలో ఉంచుకుని మాలలంతా ఐక్యమై కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సూర్యాపేట జిల్లా కేంద్రం మంత్రి జగదీశ్‌రెడ్డి పాలనలో ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. ప్రజలంతా ఏకమై అభివృద్ధి ప్రదాత, మంత్రి జగదీశ్‌రెడ్డిని గెలిపించి మరింత అభివృద్ధికి బాటలు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాల సంఘాల జేఏసీ కన్వీనర్ నల్లాల కనకరాజు, వర్కింగ్ చైర్మన్లు తాళ్లపల్లి రవి, మేకవెంకన్న, గుడిమల్ల వినోద్, మంత్రి నర్సింహయ్య, కో చైర్మన్ గడ్డం సత్యనారాయణ, వైస్ చైర్మన్ తాలుకా అనీల్, ఎండీ వినోద్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు బొల్లెద్దు వినయ్, పట్టణాధ్యక్షుడు బొల్లెద్దు మహేందర్, పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ మద్దూరి కుమార్, నాయకులు విక్రమ్, బైరెడ్ల శ్యామ్‌సుందర్ పాల్గొన్నారు.

# కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో పసలేదు

- సీఎం సభలతో బీఆర్ఎస్‌పై ప్రజలకు విశ్వాసం పెరిగింది
- ఉమ్మడి జిల్లాలో 12కు 12 స్థానాల్లో గులాబీ జెండా ఎగురవేస్తాం
- రేపు సూర్యాపేటలో సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ
- సభా స్థలిని పరిశీలించిన మంత్రి జగదీశ్‌రెడ్డి



సభా స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట, నవంబర్ 19 (నమస్తే తెలంగాణ) : ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సీఎం కేసీఆర్ సభలతో బీఆర్ఎస్‌పై ప్రజలకు విశ్వాసం పెరిగింది.. నమ్మకం కుదిరిందని బీఆర్ఎస్ సూర్యాపేట అభ్యర్థి, రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. సూర్యాపేటలో ఈ నెల 21న జరిగే ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభా స్థలాన్ని ఆదివారం మంత్రి పరిశీలించారు. ఏర్పాట్లపై సలహాలు, సూచనలు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. సీఎం రాక కోసం సూర్యాపేట ప్రజలు ఆతృతగా ఎదురు చూస్తున్నట్లు చెపారు. కాంగ్రెస్, బీజేపీ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు తెలుపడమే కాకుండా సూర్యాపేట అభివృద్ధి కోసం ఏం చేస్తామనే విషయాన్ని, బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను ప్రజలకు సీఎం కేసీఆర్ వివరిస్తారని తెలిపారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సీఎం పాల్గొన్న తొమ్మిది బహిరంగ సభలతో బీఆర్ఎస్‌కు ఆదరణ పెరిగిందని, దాంతో కాంగ్రెస్ నాయకుల్లో ఫ్రస్ట్రేషన్ కనపడుతుందన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 12కు 12 స్థానాల్లో గులాబీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ రాష్ట్ర నేతలు రాహుల్‌గాంధీతో మాట్లాడించే ప్రతి అక్షరం అబద్ధమని తెలిపారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో పసలేదని, అది ప్రజలకు పనికి వచ్చేది కాదని ఎద్దేవా చేశారు. అబద్ధాలు, మోసాలతో ఎలాగైనా అధికారంలోకి రావాలనేది కాంగ్రెస్ లక్ష్యమన్నట్లుగా మ్యానిఫెస్టో ఉన్నదని చెప్పారు. బడ్జెట్ మొత్తం ఒకే పథకానికి సరిపోయే పద్ధతిలో ఉన్నదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే కర్ణాటక పరిస్థితులే ఇక్కడా పునరావృతం అవుతాయని హెచ్చరించారు. తెలంగాణ తరహా మ్యానిఫెస్టోతోనే కర్ణాటకలో ప్రజలను కాంగ్రెస్ మోసం చేసిందన్నారు. తమను మోసం చేసిన కర్ణాటక ప్రభుత్వ ఆకృత్యాలను ఇక్కడి ప్రజలకు వివరించడానికి సభ ఏర్పాటు చేసుకోవడానికి సిద్ధమైన కర్ణాటక రైతులు అభినందనీయులన్నారు. వారి సభకు ఎలక్షన్ కమిషన్ అనుమతిస్తుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

# అభివృద్ధి పాలనను ఆశీర్వదించండి

• మంత్రి జగదీశ్‌రెడ్డి సతీమణి సునీత

సూర్యాపేట టౌన్, నవంబర్ 19 : పదేండ్లుగా సూర్యాపేటలో ప్రశాంత వాతావరణంలో జరిగిన అభివృద్ధి పాలనను ప్రజలు ఆశీర్వదించి మరో మారు మంత్రి జగదీశ్‌రెడ్డిని గెలిపించాలని మంత్రి సతీమణి సునీత, తండ్రి రామచంద్రారెడ్డి కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని 15, 48వ వార్డుల్లో వారు ఇంటింటి ప్రచారం నిర్వహించి బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను వివరించి కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. జగదీశ్‌రెడ్డిని హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా గెలిపించుకుని అభివృద్ధి పాలన కొనసాగించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మంత్రి కుమారుడు వేమన్‌రెడ్డి, నాయకులు గుర్రం సత్యనారాయణరెడ్డి, దేవత్ కిషన్‌నాయక్, బండారు సోమయ్య, బొమ్మిడి అశోక్, ఊర గాయిత్రి, చనగాని అంజమ్మ, దండు రేణుక పాల్గొన్నారు.



సూర్యాపేటలోని 48వ వార్డులో ఇంటింటి ప్రచారం చేస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి సతీమణి సునీత



సూర్యాపేటలోని 15వ వార్డులో మహిళకు బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను వివరిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి తండ్రి రామచంద్రారెడ్డి, కుమారుడు వేమన్‌రెడ్డి



చివ్వెంల : ఉండ్రుగొండలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



సూర్యాపేట రూరల్ : సఫావత్‌తండాలో ప్రచారం చేస్తున్న జడ్పీటీసీ భిక్షం

### అభివృద్ధి ప్రదాత జగదీశ్‌రెడ్డికే మా మద్దతు

బొడ్రాయిబజార్ : అరవయేండ్లలో జరుగని అభివృద్ధి కేవలం తొమ్మిదిన్నరేండ్లలో చేసి చూపించిన బీఆర్ఎస్ సూర్యాపేట అభ్యర్థి, రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డికే తమ మద్దతు అంటూ సూర్యాపేట వాసులు ముక్తకంఠంతో ప్రకటిస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ తెపారు. జిల్లా కేంద్రంలోని 9వ వార్డులో మున్సిపల్ చైర్‌పర్సన్ గడప గడపకూ తిరుగుతూ పార్టీ మ్యానిఫెస్టోను వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో గుండగాని నాగభూషణం, మద్దూరి కుమార్, బాలెంల సాయికుమార్, గుంజ శ్రీను, కంకణాల సందీప్, బండమీది రజిత, మరియమ్మ, ఉప్పలమ్మ, దేవరగట్ల వసంత పాల్గొన్నారు.

### మంత్రి జగదీశ్‌రెడ్డితోనే నియోజక వర్గం అభివృద్ధి

చివ్వెంల : మంత్రి జగదీశ్‌రెడ్డితోనే సూర్యాపేట నియోజక వర్గం అభివృద్ధి చెందిందని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు జూలకంటి జీవన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో మంత్రి గెలుపును కాంక్షిస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో జడ్పీటీసీ భూక్యా సంజీవ్‌నాయక్, పీఏసీఎస్ చైర్మన్ మారినేని సుధీర్‌రావు, జిల్లా నాయకులు రౌతు నర్సింహారావు, గుర్రం సత్యనారాయణరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### బీఆర్ఎస్ హ్యాట్రిక్ ఖాయం

ఆత్మకూర్.ఎస్ : రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ మూడోసారి అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ జిల్లా నాయకుడు బెల్లంకొండ యాదగిరి అన్నారు. మండలంలోని నెమ్మికల్, ఏనుబాముల గ్రామాల్లో ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించి మాట్లాడారు. సూర్యాపేట నియోజక వర్గంలో జరిగిన అభివృద్ధి, అమలవుతున్న సంక్షేమ పథకాలే మంత్రి జగదీశ్‌రెడ్డిని గెలిపిస్తాయన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఎడవెల్లి ముత్తయ్య, బిజిగ సైదులు, బొల్లెపాక సైదులు, ఎడవెల్లి చిన్న ముత్తయ్య, రేణిగుంట్ల ఉపేందర్, పందిరి కృష్ణారెడ్డి, గరిగంటి ప్రకాశ్, జలగం సైదులు, వెంకట నర్సు, పచ్చిపాల సైదులు, శ్రీను పాల్గొన్నారు.

సూర్యాపేట రూరల్ : బీఆర్ఎస్ కారు గుర్తుకు ఓటు వేసి మంత్రి జగదీశ్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని జడ్పీటీసీ జీడి భిక్షం ప్రజలను కోరారు. మండలంలోని సఫావత్‌తండాలో ఎన్నికల ప్రచారం నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ సఫావత్ లాలూనాయక్ పాల్గొన్నారు.

### దళితుల ఆత్మ బంధువు సీఎం కేసీఆర్..

ఆత్మకూర్.ఎస్ : దళితుల ఆత్మ బంధువు సీఎం కేసీఆర్ అని సీనియర్ న్యాయవాది, దళిత నాయకుడు తలమల్ల హసేన్, బీఆర్ఎస్ దళిత న్యాయవాది జిలకర చంద్రమౌళి అన్నారు. మండలంలోని కందగట్ల, నెమ్మికల్, పాత సూర్యాపేట, ఏనుబాముల, పెన్‌పహాడ్ మండలంలోని అనాజిపురం, నాగులపాటి అన్నారం, భక్తళాపురం, ధర్మారం తదితర గ్రామాల్లోని దళిత వాడల్లో దళిత న్యాయవాదులతో కలిసి కారు గుర్తుకు ఓటు వేసి మంత్రి జగదీశ్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో దళిత న్యాయవాదులు అనుముల పురి సైదులు, చిప్పలపల్లి చిరంజీవి, మీసాల శ్రీనివాస్, దళిత నాయకులు గోలి సాంబయ్య, దాసరి దేవయ్య, గాజుల నర్సయ్య, గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



బొడ్రాయిబజార్ : 9వ వార్డులో గడప గడపకూ తిరిగి ఓటు అభ్యర్థిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ



ఆత్మకూర్.ఎస్ దళితవాడలో ప్రచారం చేస్తున్న దళిత న్యాయవాదులు